# 35. శకున పక్షి

నాకు తెలుసు.

ఆ క్షణంనుంచి ఆ గౌరీపతి పెళ్ళామూ, పిల్లలూ బ్రతకడం ప్రారంభించారంటే అది ఓ నెగిటివ్ స్టేట్‌మెంటే కావొచ్చు.

నాకూ, గౌరీపతికి మొదటి పరిచయం మా వీధి గుమ్మంలోనే జరిగింది. రోజూ తెల్లవారేసరికి స్టెయిన్‌లెస్ స్టీలు క్యారేజీకి ఒకటి పట్టుకుని మాయింటి ముందునుంచే అతను వెళ్ళేవాడు. ఓరోజు వీధి అరుగుమీద కూచుని మొహం కడుక్కుంటూ అతన్ని పలకరించాను.

"అదేమిటి, మీరు దగ్గిరుండి పాలు పితికించుకుని తెచ్చుకోరూ?' అన్నాడతను, అలా చెయ్యకుండా ఇంకా ఎలా బ్రతికున్నారండీ చిత్రం! అన్నంత ఆశ్చర్యంగా.

"మీరేమీ అనుకోకపోతే ఒకమాట చెబుతాను. ఈ మధ్య ఈగేదెల వాళ్ళు ఏంచేస్తున్నారో తెలుసా? పాలు పిండి నూతిలో పోస్తున్నారు. మనం అడిగినదాన్నిబట్టి నూతి లోంచి పాలు తోడి మనకి సప్లై చేస్తున్నారు. వాళ్ళనని ఏం లాభం, మనమందరం ఏకమాట అనుకుంటే ఏనాడో వాళ్ళ ఆటకట్టును.'

అతనూ వెళ్ళనిచ్చి మా రత్నం తను నిలబడలేదు, నన్ను నిలబడనియ్యలేదు.

"చూశారా, చూశారా, తెల్లారి లేచింది మొదలు సంసారంకోసం ఆ పెద్ద మనిషి జంఝాటన! మనమూ ఉన్నాం. ఎందుకూ? గుమ్మం దిగం, ఎవర్నీ కనుక్కోం, ఆ సన్యాసయ్యగాడి నీళ్ళ పాలు తాగలేక మా ప్రాణాలు పోతున్నాయి. మీకేం, ఏహోటల్లోనో కావలసినన్ని సార్లు తాగి వస్తారు."

ఇంకా చాలా దూరం, చాలా ఘాటుగా ఉపన్యసించింది.

తత్ఫలితంగా ఆ మర్నాటి ఉదయం అతను వచ్చే టైముకి ఖాళీ హార్లిక్కుసీసా పట్టుకుని దీనంగా మా వీధిలో నిలబడి ఉన్నాను నేను. నన్ను చూడగానే అతని ముఖం విడుతుందనుకున్నాను. తగుమాత్రం ముడుచుకుంది!

"ఊ పదండి! ఎన్నాళ్ళనుంచో ఈ ఊళ్ళో ఉన్నానని చెబుతున్నారు, ఇంతకుముందే మీరీ మంచిపద్ధతి అవలంబించిఉంటే మాకీ నాడు ఈ పాట్లు ఉండేవా?"

నోరు మూసుకుని అతని అడుగుజాడలు అనుసరించడంతప్ప నేను చెయ్యగలిగింది ఏముంది!

ఇక అతని కబుర్లంటూ ఎలా ఉంటాయంటే "చూశారా, ధరలు ఎలా మండిపోతున్నాయో!"

"విన్నారా, ఈ కూలిజనం ఎలా పేట్రేగిపోతున్నారో!"

"గమనించారా, ఎంతమోసం, అన్యాయం జరిగిపోతోందో దేశంలో!" అతని రిమార్కులు మా పరిచయం పెరిగిన కొద్దీ స్వవిషయంమీదకి మళ్ళేవి.

'పిల్లని చూసుకో నచ్చితే వాళ్ళు ఎన్నాళ్ళయినా అట్టేపెడతారు. తొందరేం లేదు. మనం ముందుగా అనుకుంటే సరి.'

అని గౌరీపతి తల్లీ, తండ్రీ అతనికి యిరవై రెండు ఏళ్ళ వెళ్ళనిచ్చారుకాదు. చూసినపిల్లని చేసుకోకుండా ఎలా ఊరుకోడమో గౌరీపతికి బోధపళ్ళేదు. "ముందు పెళ్ళవనీ, కావలిస్తే నీ చదువయాక కార్యం చేసుకోవచ్చు" అన్నారు ఆ పెద్దలే.

పెళ్ళయాక పిల్లని దూరంగా ఉంచడమెలాగో గౌరీపతికి అర్థంకాలేదు. అబ్బాయికి పెళ్ళీ అయాక, అమ్మాయి కాపరానికీ వచ్చాక, తాము పుట్టకుండా ఎలా ఉండడమో పిల్లలకీ తెలిసి రాలేదుట!

"అమ్మోయి, బాబోయి" అని అతనూ భార్యా గుర్తించేలోగానే 'అమ్మా' 'బాబూ' అని పిలిచేవాళ్ళ సంఖ్య ఆ కొంపలో అరడజను దాటిపోయిందిట.

"తెలిసి తెలిసి అమ్మా నాన్నా నన్నీ అఘాతంలోకి తోశారు. నేనేం తప్పుచేశాను చెప్పండి!" అన్నాడు గౌరీపతి ఇంతమొహం చేసుకుని. మేమీకబుర్లు చెప్పుకుని నడిచే సరికి పాల పైడమ్మ గేదెల పాక వచ్చేసింది.

"దగ్గరుండి పితికించుకుంటున్నా వీళ్ళెంత మస్కా కొట్టున్నారో చూశారా? ఏం కలిపారో ఏమో నిన్న పెరుగు నీళ్ళకన్న అధ్వాన్నంగా ఉంది!" అన్నాడు గౌరీపతి.

ఆ మూడోనాడు కాబోలు తన ఉద్యోగ ప్రసక్తి తెచ్చాడు. అతని భార్య మేనమామో ఎవరోట, ఎవరో మినిష్టరు కాళ్ళుసట్టుకుని అతి కష్టంమీద తనకా ఉద్యోగం వేయించాట్ట. నేను ఊరుకోలేక అన్నాను.

"పాపం ఆయన మీకు చేసిన సహాయం ఎప్పటికీ తీర్చుకోలేనిది"

'ఆఖరికి చదువుకున్న మీరూ మా కూపస్థమండూకంలాగే శలవిచ్చారే!' నేను తెల్లబోయి చూశాను.

"అదే మా ఆవిడ, వాళ్ళ మేనమామ తన మొగుడికి ఉద్యోగం యిప్పించకపోతే యిక మనం నాలుగు వీధులూ అడుక్కుందుమనే దాని ఉద్దేశం. దిక్కుమాలిన ఉద్యోగం వేయించకపోయినా బాగుణ్ను. ఎవళ్ళేడిశారు యింతోటి నౌఖరీ లేకపోతే దినం తీరదని".

"ఏం మీపని మీరు లైక్‌చెయ్యరా!

"మాబాగా అడిగారు, నాకా, సేల్సుమేన్ ఉద్యోగమా! ఇంట్లోతీసిన వెన్నకాచిన నెయ్యి లాంటి కళాభిరుచి నాది. ఆఖరికి నా ఖర్మకొద్దీ రుచీ వాసనా లేని డాల్డాలాంటి ఉద్యోగం వచ్చింది. మనిషి విలువచూసి పని అప్పజెప్పే సంస్థలెక్కడ ఏడిశాయి ఈ దౌర్భాగ్యపుదేశంలో! ఏదో చావకుండా బతక్కుండా వెళ్ళబుచ్చడం తప్ప ఏం చెయ్యగలం!"

"ఎంతిస్తారేం!"

"ఇస్తారు కళ్ళవేడుకకి అయిదువందలని..... కాని ఏంలాభం! ఈ కంపెనీకి విపరీతమైన

పోటీలు ఉన్నాయి. సేల్సులో ఏమాత్రం వెనకబడినా ఆర్డర్సు వచ్చిపడతాయి తక్షణం బ్రాంచి మూసెయ్యమని..... దిన దినగండం నూరేళ్లాయుషూనూ, నా ఏడుపు అందుకుకాదు. అంతవిశాల విశ్వంలో నాలాంటి వ్యక్తి ప్రతిభని గుర్తించే సంస్థ ఒక్కటంటే ఒక్కటయినా లేకపోయింది కదా అని"

"ఇంతకీ ఎన్నాళ్ళయిందంటారు, మీరీ ఉద్యోగంలో చేరి?"

'ఆ భోగట్టాలన్నీ ఎందుకడుగుతారు బాబూ! అమూల్యమైన నా కాలం ఎంత వృధా అయిపోయిందో తలుచుకుని నేను దుఃఖపడ్డానికా! అయింది మాటవరసకి ఎనిమిదేళ్ళు. ఇదే ఏ బ్యాంక్‌లోనో అయితే ఈ పాటికి ఎడంచేత్తో ఏ ఆరొందలో అందుకోనూ!'

"ఇప్పుడు మీకు వస్తున్నదీ మరీ తక్కువ కాదు గదండీ!

"బాగుంది ఏం అమాయకంగా అడిగారూ, తుమ్మితే ఊడిపోయే ముక్కు ఎంత పాడుగుంటేనేం!"

"అదేమిటి ఎనిమిదేళ్ళయి చేస్తున్నానన్నారుగా!"

'అయ్యో రామా, ఓ మనిషి జీవితంలో ఓ ఎనిమిదేళ్ళనగా ఎంత? మా ఉద్యోగంలో ఒడుదుడుకులు మీరేం ఎరుగుదురు! నాలుగు డిగ్రీలు తెచ్చుకున్నాను, ఎందుకూ! ఇలా చచ్చు పెద్దమ్మల వెనక చిత్తం చిత్తం అంటూ తిరగడానికా! నా ఖర్మ కాలిపోనూ, మా ఊళ్ళో జోళ్ళు కుట్టుకునే సూరిగాడిపాటి చెయ్యకపోయానా నేను, వాడికిప్పుడు హైదరాబాదులో వేలమీద జోళ్ళ వ్యాపారమా! మూడంతస్థుల మేడా వాడిది, నాదేమో ఏ క్షణాన పడిపోతుందో అన్న పాతకొంపా! ఈ ఘోరకలికి అంతులేదటండీ!'

ఈ మాటలు సాగుతూండగా మా ఇల్లు వచ్చేసింది.

"వస్తానండీ మళ్ళీ రేప్పొద్దున కలుద్దాం". "అలాగే' అని రెండడుగుల వేసి వెనక్కి తిరిగి

"అవును గాని గేదెకి ఏం పెడుతున్నారంటారు వీళ్ళు, నిన్న కాఫీ ఏం బాగులేదు, మీరు గమనించారా!'

అని హెచ్చరించి వెళ్ళిపోయాడు.

ఇంకో వారం రోజులకి ఓ నాడు వస్తూనే.

"ఇవాళ పైడమ్మని నిలదీస్తాను. అన్నంత సొమ్మూ ఇస్తూంటే ఎందుకిలా మోసం చేస్తోందో..... నిన్నటి పాలు ఒక పట్టాన తోడుకోలే...... అబ్బబ్బ వీళ్ళతో పడలేకుండా ఉన్నామండీ...... నిజాయితీ అన్నది మచ్చుకయినా దొరకడం లేదు మాయదారిముండాలోకంలో ' అంటూ ఆరంభించాడు.

"ఇంతకీ వీళ్ళని అనుకోడం దేనికి, అయిన వాళ్ళే గొంతుక కోశాక!' అంటూ ప్రారంభోత్సవం చేసి అసలు సంగతి బయటపెట్టేడు.

"మీరు గమనించేఉంటారు. చచ్చీమానుషం నాకు. పీకపోయినా గుట్టు బయటపెట్టను. ఎదుటి వాళ్ళని ఒక్క ముక్క అనాలంటే పీకపోయినట్టుంటుంది నాకు. అయినా నా మంచితనం

ఎవరు గుర్తించారని! ఎవరిమటుకో ఎందుకు పిల్లనిచ్చినవాడికే అంత పక్షపాతం ఉండాలా? మా మావగారికి ముగ్గురు కూతుళ్ళు, వింటున్నారా ఇదే ఇంటికి జేష్టాదేవి. ఆయనకున్న పదెకరాల్లో కొడుక్కి ఏడెకరాలు రాసేసి మిగిలినది ముగ్గురు కూతుళ్ళకీ తలో ఎకరం పెళ్ళికి యిచ్చేడు.'

"కొడుక్కయితే ఏడెకరాలా? కూతురికయితే ఒకటా? అంత అన్యాయమా?' "ఆడపుట్టుక పుట్టేక అఘోరించవలసిందే. అందుకుకాదు నా ఏడుపు. ఆ కూతుళ్ళలోనే మళ్ళీ మా ఆవిడ విషయంలో అంత దుర్మార్గం దేనికని?'

'అంటే?'

'వినండి మరి ....... పెళ్ళిముందు సంప్రదింపులకి వచ్చినపుడు మా నాన్నని అడిగాడుకదా! పిల్లాడికియిచ్చే అయిదువేలూ కట్నం కాక మా అమ్మాయికి నేను ఒక ఎకరం పసుపూ కుంకుమలకింద ఇవ్వదలచుకున్నాను. మా అమ్మాయి ఏమిటి లెండి యిక మీ అమ్మాయే. 'అలా భూమి కింద రాయమన్నారా లేక ఎకరం అమ్మేసి సొమ్ము యివ్వమంటారా?' మీరెలా చెబితే అలాగే చేస్తాము" వాడింత దుష్టని అప్పట్లో మాకేం తెలుసు! డబ్బే ఇమ్మన్నాం, మా అవసరాన్ని బట్టి, ఆ రోజుల్లో ఎకరానికి మూడువేలు వచ్చింది. మూణ్ణిమిషాల్లో అయిపోయిందికూడా. మిగిలిన యిద్దరు కూతుళ్లూ వేరు, వాళ్ళ పెళ్ళిళ్లు మరుసటి ఏడే చేసేశాడు. వాళ్ళు భూమే కావాలన్నారు. మా మావగారు యిప్పటికీ ఆ పల్లెటూళ్ళోనే స్థిరపడి పదిమందినిచూసి ఓహో అనిపించుకుంటున్నాడు. ఇప్పుడా భూమి విలువ ఎంతో తెలుసా! ఎకరం పదిహేనువేలు! అంతేకాదు, ఏటా భూమ్మీదవచ్చే ఫలసాయం అందుమీదే పెట్టి క్రమంగా ఈ పదేళ్ళలోనూ ఒక్కొక్కళ్ళకి రెండేసి ఎకరాలు చేసిపెట్టేడు. మా ముష్టి మూడువేలూ ఆనాడే పులుసులో పడిపోయింది. ఈనాడు మా మరదళ్ళిద్దరూ ముప్పైవేల ఆస్తి పరులయారు. ఏంపాపం చేశామని మా మావగారు యింత దుర్మార్గంచేశాడు చెప్పండి మాపట్ల!'

"భూమి యిమ్మన్నారా, డబ్బిమ్మన్నారా అని ముందే అడిగేడు కదండీ!"

"అడిగితే, మేం డబ్బే కావాలన్నాం అనుకోండి, అందులో మంచీ చెడ్డా మాకు బోధపరచొద్దూ? ఇదేనా పెద్దమనిషి తరహా? కానియ్యండి, అందరిదీ పడేసుకుని వాళ్ళనే బాగుపడనీండి. మాకుటుంబం అంటే, అందులో ముఖ్యంగా నేనంటే అతనికి మొదట్నుంచీ మంటే."

ఇంకా ఎన్ని చెప్పునో నాకూ అతనికీ వేళయిపోయింది. ఎవరి పనిమీద వాళ్ళు విడిపోయాం. ఎప్పుడు తెల్లారుతుందా ఎప్పుడు గౌరీపతి వస్తున్నాడా అని మొదట్లో అనిపించేది. అతని కబుర్లు వింటున్నకొద్దీ అప్పుడే తెల్లారిపోతుందో ఏమో అని బెంగట్టుకుంది!

'మీరు మునపట్లా లేరు. ప్రతి చిన్నదానికి అనవసరంగా విసుక్కుంటున్నారు' అని ఓ నాడు రిమార్కుచేసింది మా రత్నం. తెల్లబోయాను.

"గౌరీపతి సావాస ఫలితం కాదుకదా" అనుకుంటూంటే నా గుండె భయాందోళనలతో కొట్టుకుంది.

ఆ సాయంకాలం మా వాసు మరికొన్ని విషయాలు చెప్పి నాఅనుమానాన్ని వృద్ధి చేశాడు. నాకు మాకు దూరపు చుట్టం. వాసూ, గౌరీపతీ ఒకే కంపెనీలో పనిచేస్తున్నట్టు అప్పుడే తెలిసింది.

'ఇన్నాళ్ళకు మా అదృష్టం పండిందోయ్ శాస్త్రీ మేం ఈ ఊళ్ళోంచి వెళ్ళిపోతున్నాం ఎన్నాళ్ళ నుంచో ట్రై చేస్తున్నాం. ఇప్పటికి నాకు ట్రాన్సపర్‌యింది.' అన్నాడు వస్తూనే. ఎక్కడికని అడిగాను.

"ఈవూరు కాకపోతే ఎక్కడయినా ఒకటే"

"అదేం అంత అసహ్యం కలిగిందా, ఈ ఊరంటే?"

"ఊరంటే ఊరు కాదనుకో! మా ఆఫీసులో ఒకడున్నాడు. అతను ఎక్కడుంటాడో అక్కడ చీకటీ. దుఃఖమూ ఉంటాయి. పేరేమిటో నాకు సరిగ్గా తెలీదుగాని 'శకునపక్షి' అంటూంటాంమేం!"

ఎలా ఉంటాడో అతను చెప్పమన్నాను. వాసు చెప్పేడు. సందేహంలేదు. అతను మా గౌరీపతే!

'అబ్బబ్బ...... అతన్ని చూసి ఏ రోజు ఏం కబురుతెస్తాడో అని అందరికీ భయమేనోయ్......... ఎప్పటికప్పుడు మరుక్షణంలో మనమీద పిడుగు పడుతుందని గుర్తుచేస్తుంటాడు. రోజా విన్న కబుర్లే కనక ఎవ్వరం నమ్మమనుకో. అయినా అతను బాగా సీనియరు....... ఎంతో నమ్మకంగా చెబుతాడు కబుర్లు...... "మొన్ననే కాయితాలు చూశాను. మనలో జూనియర్స్‌కి రిట్రెంచ్‌మెంటు తప్పదు. బియ్యం బస్తా రెండొందలు అయిపోయిందిట. మీరు విన్నారో లేదో ఇవాళ రేడియో విన్నారా. పన్నులు మళ్ళీ పెంచారుట. ఇలా వుంటాయి. ఈ కరువు కాలంలో ఏటికెదురీదుతూ రోజులు వెళ్ళబుచ్చలేక యిప్పటికే ప్రాణాలు పోతున్నాయి. శకునపక్షి కబుర్లు వింటుంటే ఎంత కాదనుకున్నా గుండెలు పీచు పీచుమనక మానవు పోన్లే.... ఇన్నాళ్ళకి అతని గోల వదిలింది కదా!' అని చెప్పి వెళ్లిపోయాడు.

ప్రతిరోజూ ఈ తద్దినం నాకు మాత్రం తప్పదా, ఆ నీడనన్ను కమ్మేస్తే, ఆ నిరాశావాద ప్రభావం నా వ్యక్తిత్వాన్ని క్రమ క్రమంగా కబళిస్తే, ఇంక నాకు వెలుగెక్కడ? వెంటనే మరో చోటికి పాలు తెచ్చుకునే ఏర్పాటుచేసుకున్నాను. 'మీరు తొందరపడి మార్చేశారుగాని వాళ్ళు మాత్రం తిన్నగా ఇస్తారని ఎక్కడుంది.? అందరూ అందరే ఈ ముదనష్టపు లోకంలో' అని ఓరిమార్కు వదలి చరచరా వెళ్ళిపోయాడు. 'ఆ అందర్లో నువ్వూ ఉన్నావు సుమా' అన్నట్లు నాక్కూడా దీవెనలు అయిపోయాయా అనిపించింది. 'ఏమయితేనేం వదిలాడు జిడ్డు' అని తృప్తిపడ్డాను. ఇది జరిగిన పదిహేను రోజులకి ఓ సాయంకాలపు వేళ, 'పాపం ఆ యిల్లాలు కంటికీ మంటికీ ఏకధారగా కుమిలిపోతోందండీ' అంది మా రత్నం.

"అలా చూస్తారేం ఏం ఎరగనట్టూ సంపాదించారుగా ఎలాగయితేనేం ఓ స్నేహితుణ్ణి మీ గౌరీపతిగారండీ....." అతని భార్య అరుంధతి గురించి, ఆనాటినుంచి మళ్ళీ యిప్పటికి తీరుబడి అయింది వాళ్ళింటికి వెళ్ళడానికి. అప్పుడు వెళ్ళినప్పుడు ఆ పీనుగ ఇంట్లో ఉన్నాడు. ఇవాళ వెళ్ళానా అతను ఊళ్ళోలేడుట. కేంపుకో ఎక్కడికో అఘోరించాడుట. నిజానికి ఆవాళకీ, ఇవాళకీ ఎంత తేడా అండీ అడ్డదిడ్డంగా పెరిగిన పెద్ద పెద్ద ముళ్ళచెట్లని కొట్టించేసి వరసగా రంగు రంగుల పూల మొక్కలు

పాతితే ఎలా ఉంటుంది. అంత కళ కళ లాడుతూ ఉన్నాయి ఇవాళే ఆ తల్లీ పిల్లల ముఖాలు. అతను యింటికివస్తే చాలుట అందరూ వణికి పోతారుట. ఎన్ని చెప్పిందో పాపం..... మీరో సారి గట్టిగా చివాట్లు వెయ్యకూడదూ, ఎందుకలా కాల్చుకుతింటాడో,' గౌరీపతి అంటే నాకే భయం పట్టుకుందనీ తప్పించుకు తిరుగుతున్నానీ మా రత్నానికి ఎలా చెప్పేది?'

అరుంధతిపట్ల సానుభూతితో నా హృదయం ఆర్ద్రమయింది.

గౌరీపతి పొడగిట్టక వాసు బదిలీ చేయించుకున్నాడు.

నేను పాల వాడుకని మార్చుకున్నాను.

పాపం అరుంధతీ, పిల్లలూ ఎక్కడికి పోగలరు?

ఎలా వాళ్ళకి విముక్తి.?

ఈ సమస్య యింత సుళువుగా విడుతుందని కలలో అనుకోలేదు. ఆ నెలాఖరుకి జీతాలు అందేక, పుచ్చుకున్న పాలకు డబ్బు యిచ్చేద్దాం కదా అని పాల పైడమ్మ పాకకి వెళ్ళేను.

"చూస్తూండగా ఎంత ఘోరం జరిగిపోయింది బాబూ!' అని గోలపెడుతూ పైడమ్మ జరిగింది ఒకటీ ఒకటీ బయటపెట్టింది.

ఆ రోజు పొద్దున పాలు పోయించుకోడానికి వచ్చినప్పుడు 'మీరు నీళ్ళు కలిపేస్తున్నారు. మీటరు వేసి చూశాను, మిమ్మల్ని అరెస్టు చేయిస్తాను!' అని గంటకొద్దీ హోరాహోరీగా పైడమ్మతో వాదించాట్ట. నాకు తెలుసు. చెంబు బోర్లించి చూపింది, గుడ్డ పెట్టి లోపల తుడిచి, నిప్పుసెగ ఓమారు చూపించి పాలుపితికినా, అతను నమ్మడు! పైడమ్మా ఊరుకోలేదు. దులిపి దుళ్ళగొట్టి ఒదిలి పెట్టిందట. "మీ చేత్తో మీరు పితుక్కోండి. అంతకంటె మా వల్లగాదు.' అంది ఆఖరి మాటగా.

'నాకామాత్రం చేతకాదనుకున్నారా?' అని చెంబుతీసుకుని వద్దు వద్దంటున్నా ఉపక్రమించాడుట. ఆ గేది అసలే మహా పొగరుమోతు. పైగా గౌరీపతి వాలకం మొదట్నుంచీ కనిపెట్టి విసిగి ఉందోయేమో ఇలా పొదుగు దగ్గిర చెయ్యి పెట్టాడో లేదో అక్షరాలా 'చచ్చేలా' తన్ని వదిలి పెట్టిందిట. ఆ విసురుకి అంతమనిషీ వెళ్ళకిలా పడ్డాడు. అతని ఖర్మంకాలి అక్కడే సూదిగా ఉన్న బండరాయిమీద బరువుగా తలమోసిందట, పైడమ్మ కళ్ళు తిరిగిపోయాయి. అంత రక్తం ఎప్పుడూ కళ్ళ చూల్లేదుట. వెంటనే ఆసుపత్రికి పరిగెత్తాను.

"ఆసుపత్రికి తీసుకురావడం చాలా ఆలస్యం చేశారు. బాగా పెద్దదెబ్బ తగిలింది. తగలకూడని చోట. బాగా రక్తం పోయింది. బతకడం కష్టం" అని చెప్పేడు నాకు తెలిసిన కంపౌండరొకడు అక్కడ తటస్థపడి.

బెంచీమీద కూచుని ఉన్నారు. అరుంధతీ, ఆరుగురు పిల్లలూ వాళ్ళు మొహాలలో దైన్యం కంటే ఆతృతే ఎక్కువగా కనిపించింది. 'కొంపతీసి గౌరీపతి బతికెయ్యడు గదా!' అని కాదుగదా అనిపించింది!

ఇంత కఠినంగా చెబుతున్నందుకు బాధగానే ఉంది. గౌరీపతి మరణానంతరం అతని పెళ్ళాం బిడ్డలూ ఎలా బతుకుతారన్నది సమస్యే. అతను కూడా ఉండగా వాళ్లు బతికి ఉండగలిగారా అనేది ప్రశ్న.

ఎంత దుర్మార్గుడైన మొగుడైనా నెలకింతని తెచ్చి పడేస్తున్నాడు, ఆయన లేకపోతే వాళ్లెలా బతుకుతారు అనేది చిక్కు ప్రశ్న. 'కనీసం నాలుగువీధులు అడుక్కుతినే స్వతంత్రమైనా వాళ్లకి మిగులుతుంది కదా' అనేది అతి కఠినమైన వాస్తవం!

★